క్లుప్తంగా

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం పట్టు వస్త్రాలతో అలంకరించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

యంత్ర పరికరాలు కొనుగోలు చేయాలి

దొర్నిపాడు:సీహెచ్‌సీ (కస్టమ్స్ హైరింగ్ సెంటర్) గ్రూపు సభ్యులు వ్యవసాయ యంత్ర పరికరాలు కొలుగోలు చేస్తే మార్చి 2వ తేదీ లోపు రాయితీ సొమ్ము వస్తుందని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ తెలిపారు. శుక్రవారం మండలంలోని డబ్ల్యూ. గోవిందిన్నె గ్రామ ఆర్‌బీకేలో సీహెచ్‌సీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. మండలంలోని 9 రైతు భరోసా కేంద్రాలకు గాను గుండుపాపల, కొండాపురం, చాకరాజువేముల, బుర్రారెడ్డిపల్లె సీహెచ్‌సీలు సీహెచ్‌సీ గ్రూపులు మాత్రమే రూ.15లక్షల విలవజేసే పరికరాలను కొనుగోలు చేశారన్నారు. దొర్నిపాడు-1, 2, క్రిష్టిపాడు, డబ్ల్యూ.కొత్తపల్లె, డబ్ల్యూ.గోవిందిన్నెకు చెందిన సభ్యులు యంత్రపరికరాలు కొనుగోలు చేయాలని కోరారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శివరాత్రిని పురస్కరించుకొని ఎనిమిది చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు రెడ్‌క్రాస్ చైర్మన్, వైస్ చైర్మన్ దస్తగిరి, మారుతికుమార్ శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ వైద్య శిబిరాల్లో సేవలు అందించేందుకు విద్యార్థులకు దిశ నిర్దాశం చేశారు. భక్తుల కోసం సేవలు అందించేందుకు రెడ్‌క్రాస్ సభ్యులు సిద్ధంగా ఉన్నారన్నారు. శ్రీశైలం, పెచ్చెరువు, కైలాసద్వారం, మహానంది, భోగేశ్వరం, యాగంటి, ఓంకారం క్షేత్రాల్లో ఇప్పటికే శిబిరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

'పది' ఓ మైలురాయి



విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేస్తున్న సంక్షేమాధికారి

ఉయ్యాలవాడ : విద్యార్థి దశలో పదో తరగతి ఒక మైలు రాయిలాంటిదని అధిగమించేందుకు విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాన్ని సాధించవచ్చని సంక్షేమ వసతి గృహ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో పదో తరగతికి చెందిన 16 మంది విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు సంబంధించి మెటీరియల్‌ను అందజేశారు. ఒక్కో సెట్ రూ. 480 ప్రకారం సొంతనిధులు రూ.7,680 వెచ్చించి హాస్టల్‌లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యల్లో భాగంగా విద్యార్థులకు ఉచితంగా అందజేసినట్లు వార్డెన్ తెలిపారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు



చిన్నకంబలూరులో వరి పంటలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ జ్యోతి

రుద్రవరం: తక్కువ పెట్టుబడులతో పంటలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించుకోవాలని మండల వ్యవసాయాధికారి జ్యోతి రైతులకు సూచించారు. మండలంలోని చిన్నకంబలూరు సమీపంలోని వరి పొలాల్లో శుక్రవారం ఆమె రైతులతో డాక్టర్ వైఎస్సార్ పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు బృంద విన్యాసం,పరిసరాల విశ్లేషణ వంటి వాటితో పాటు పంట సంరక్షణ, వాడాల్సిన మందులపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనలు పాటించాలని చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(అర్బన్): ఆచార్య ఎన్‌జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని ఆర్‌ఏఆర్ఎస్, కృషి విజ్ఞాన కేంద్రాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ లేబర్ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి గౌస్ కోరారు. సమస్యల పరిష్కారానికి పలుమార్లు విన్నవించినా చర్యలు లేకపోవడంతో ఈనెల 20న రాష్ట్వ్యాప్తంగా కాంట్రాక్ట్ లేబర్ నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఏడీఆర్ వెంకటేశ్వర్లుకు శుక్రవారం సమ్మె నోటీసు అందజేశారు. నాయకులు వెంకటలింగం, అయ్యన్న, పుల్లన్న, సుజాత, నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.

శివాలయాలు ముస్తాబు

- మహాశివరాత్రి వేడుకలకు నవనందుల ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి
- లింగోద్భవ సమయం అనంతరం స్వామి,అమ్మవార్ల కల్యాణం



మహాశివరాత్రికి ముస్తాబవుతున్న ప్రథమనంది ఆలయం,



బైటిపేటలోని నాగనంది ఆలయంలో ఏర్పాట్లు చేసిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): మహాశివరాత్రి పర్వదినాన్ని కనుల పండుగగా నిర్వహించడానికి పట్టణంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. శనివారం రాత్రి లింగోద్భవం తర్వాత శివ పార్వతుల కల్యాణాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మహాశివరాత్రి పండుగ రోజు శైవ క్షేత్రాలను దర్శించి పరమేశ్వరుడి అనుగ్రహాన్ని పొందడానికి భక్తులు తరలివెళ్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓలు చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, ఆంజనేయశర్మ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా బారికేడ్లు, చలువ పందిళ్లు తదితర వాటి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

- నవనందుల్లోని ప్రథమనంది, నాగనంది, సోమనందీశ్వరస్వామి ఆలయాలు శివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి. స్వామి వారికి అభిషేకాలు, రుద్రాభిషేకం, లింగోద్భవ కాలం, బిల్వార్చనలను చేయడానికి దాదాపు ఏర్పాట్లు పూర్తయ్యాయి. భక్తులు సందర్శనకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు.
- ప్రథమనందీశ్వర, గుడిపాటిగడ్డ మల్లికార్జున దేవస్థానాల్లో లింగోద్భవ సమయం అనంతరం స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహిస్తారు.
- భద్రావతి భావనారుషిలో ఆలయంలో భవానీ సమేత భావ నందీశ్వరస్వామి వారికి లఘు న్యాసక పూర్వక ఏక రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన నిర్వహించనున్నారు. అనంతరం స్పర్శ దర్శనానికి అనుమతిస్తారు.
- భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో కాశీ విశ్వేశ్వర స్వామి సంజీవనగర్ రామాలయ ఆవరణలో ఏర్పాటు చేశారు. లింగోద్భవకాలంలో అష్టోత్తర కలశ క్షీరాభిషేకం, కల్యాణం నిర్వహించనున్నారు. అనంతరం సంజీవనగర్, శ్రీనివాసనగర్‌లో ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సం జరిపించనున్నారు.
- రోజాకుంటలోని నాగలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, అర్చనలకు ఏర్పాట్లు చేశారు.
- బ్రహ్మనందీశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి లింగోద్భవ సమయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తారు.
- శ్రీకాళికాంబ చంద్రశేఖర ఆలయంలో శనివారం రాత్రి శివపార్వతుల కల్యాణం, ఉదయం చంద్రశేఖర స్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ తెలిపారు.
- హౌసింగ్ బోర్డులోని స్పటిక లింగేశ్వర ఆలయంలో రాత్రి 12.30గంటలకు శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు.



ముస్తాబయిన భాస్కర నందీశ్వర స్వామి ఆలయం

రుద్రవరం: మండల పరిధిలోని గ్రామాల్లోని శివాలయాలు శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. శనివారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, స్వామి,అమ్మవార్ల కల్యాణోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక భాస్కర నందీశ్వరస్వామి ఆలయానికి రంగులు వేయించారు. స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం పూర్తి కాగానే గ్రామోత్సవం ఉంటుందని, ఆదివారం ఆలయంలో వెయ్యి మంది భక్తులకు అన్నదాన వసతి కల్పిస్తున్నట్లు నిర్వాహకులు కృష్ణమూర్తి తలెలిపారు. అలాగే వెలగలపల్లె పొలిమేరలో వెలసిన మహాత్రిపుర సుందరి మానస లింగేశ్వర స్వామి వారి సన్నిధిలో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మహా శివరాత్రి వేడుకలు విజయవంతం చేద్దాం



శివరాత్రి వేడుకల పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: పురాతన శివాలయం కొలువైన రామతీర్థ పుట్టాలమ్మ క్షేత్రంలో మహా శివరాత్రి వేడుకలను విజయవంతం చేద్దామని క్షేత్ర చైర్మన్ గుంగుల మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. క్షేత్రం పాలక మండలి కార్యాలయంలో శుక్రవారం పాలక మండలి, అభివృద్ధి కమిటీ సభ్యుల సమావేశంలో శివరాత్రి వేడుకల పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ శివరాత్రి వేడుకలు శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని చెప్పారు. శనివారం తెల్లవారుజాము నుంచి ఆదివారం ఉదయం వరకు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించే చర్యలు పూర్తయ్యాయన్నారు. పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య లింగోద్భవ కాలములో రుద్రాభిషేకం అనంతరం శ్రీ పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. జాగరణ చేసే భక్తులు నిద్ర మేలుకొనేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పాలకమండలి సభ్యులు గంగిశెట్టి తిమ్మయ్య, కూలూరు నరసింహారెడ్డి, కృష్ణారెడ్డి ఉన్నారు.

రైతన్న మోములో 'ధర'హాసం



గుండుపాపల వద్ద ఆరబోసిన మిర్చి పంట

దొర్నిపాడు: మిర్చి రైతుకు ధర సంతోషాన్ని కలిగిస్తోంది. మండలంలో పలువురు రైతులు వరి పంటకు ప్రత్యామ్నాయంగా మిర్చి పంట సాగు చేశారు. దీంతో వారి పంట పండినట్లయ్యింది. దిగుబడితో పాటు ధర కూడా ఊహించనంతగా లభిస్తుండటంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ప్రస్తుతం రకాన్ని బట్టి క్వింటా రూ. రూ.25,000 నుంచి రూ.35,000 వరకు పలుకుతోంది. అలాగే ఎకరాకు 25 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తున్నాయి. ఈ ఏడాది మండలంలో 4,637 ఎకరాల్లో పంట సాగైంది. కాగా పంట సాగు ఖర్చుతో కూడుకున్నది కావడంతో పాటు సాగునీరు పుష్కలంగా ఉండాలి, నిర్వహణ అధికంగా ఉంటుండటంతో రైతులు సాగు చేయడానికి వెనుకంజ వేసేశారు. అయితే వరి పంటలో దిగుబడులు పడిపోతుండటం , ఖర్చులు పెరుగుతున్న కారణంగా ప్రత్యామ్నాయ పంటగా సాగు చేసి లాభాలు చూస్తున్నారు.

బదిలీల వివరాలు తెలియజేయాలి

నంద్యాల(అర్బన్): సాంఘిక సంక్షేమ శాఖ నాల్గవ తరగతి ఉద్యోగుల బదిలీల వివరాలను కేటగిరీల వారీగా ముందుగా తెలపాలని స్టేట్ గవర్నమెంట్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ క్లాస్ ఫోర్ ఎంప్లాయిస్ సర్వీసు సెంట్రల్ అసోసియేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య కోరారు. నాల్గవ తరగతి ఉద్యోగుల సమస్యలపై శుక్రవారం స్థానిక బాలుర డిగ్రీ కళాశాలల వసతి గృహంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫేస్ యాప్ ద్వారా అరకొర చదువులు ఉన్న నాల్గవ తరగతి ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామాల్లో నెట్‌వర్క్ సమస్యతో సరైన సమాచారం అందించలేకపోతున్నారని చెప్పారు. జిల్లాప్రధాన కార్యదర్శి రాజారావు, కోశాధికారి మనోవా, ఉపాధ్యక్షుడు సోనీబాయి, ప్రవీణ్‌కుమార్, బషీర్ అహమ్మద్, హనుమాన్‌నాయక్, తిరుపాలు పాల్గొన్నారు.

మండల లీగల్ సెల్ ప్యానల్ అడ్వకేట్ల ఎంపిక



బాలునాయక్,



అనిత

నంద్యాల(వ్యవసాయం): మండల లీగల్‌సెల్ సర్వీసెస్ ప్యానల్ అడ్వకేట్లుగా అనిత, బాలునాయక్‌ను ఎంపిక చేసినట్లు శనివారం మండల లీగల్‌సెల్ అధికారులు తెలిపారు. జిల్లా జైలు ప్యానల్ అడ్వకేట్‌గా బాలునాయక్ మాట్లాడుతూ జైలులోని ముద్దాయిలకు లీగల్ సర్వీసెస్‌తో పాటు అవగాహన కల్పిస్తామని చెప్పారు. రిమాండ్ అడ్వకేట్‌గా అనిత జిల్లాలోని పాణ్యం, మహానంది, నంద్యాల పోలీసు స్టేషన్, ఎక్సైజ్, తదితర పోలీసు స్టేషన్‌లో రిమాండ్ ఖైదీలకు సలహాలు, సూచనలు, సహాయ సహకారాలు మండల లీగల్‌సర్వీసెస్ ద్వారా అందించి లోక్ అదాలత్‌లో కేసులు ఉచితంగా వాదిస్తుందని పేర్కొన్నారు.వారిని సీనియర్ న్యాయవాదులు పెద్ది శ్రీనివాసులు, శ్రీరాములు, రాజగోపాల్‌రెడ్డి, ముక్కెర కృష్ణారెడ్డి, ప్రతాపరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు.

వెన్నపూసను అత్యధిక మెజార్టీతో గెలిపించండి



ప్రచార పత్రాలను విడుదల చేస్తున్న ఎంపీపీ, సొసైటీ చైర్మన్‌లు

దొర్నిపాడు: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజారీతో గెలిపించాలని ఎంపీపీ అమర్‌నాథ్ రెడ్డి, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక ఎంపీపీ కార్యలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చి పేదలకు ఆర్థికంగా అండగా నిలిచిందన్నారు. వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను బలపర్చాలని కోరారు. మార్కెట్‌యార్డు డైరెక్టర్ భూమా శ్రీనివాసరెడ్డి, నాయకుడు బాల సుబ్బయ్య పాల్గొన్నారు.

నమో నారసింహా..



ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని తిప్పారెడ్డిపల్లె గ్రామానికి పార్వేట పల్లకీ చేరుకోవడంతో నరసింహ స్వామి నామస్మరణతో గ్రామం మారుమోగింది. ఉత్సవమూర్తులు శ్రీ జ్వాలానరసింహస్వామి, ప్రహ్లాదవరద స్వామి వారికి గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని పలు తెలుపులపై స్వామి వార్లు కొలువు దీరగా నైవేద్యం సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. రాత్రికి స్వామి వారి పల్లకీ టీ.లింగదిన్నెకు చేరుకుంది.

ప్రతాపరెడ్డిపై దాడి సరికాదు

నంద్యాల(అర్బన్): ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్, ఆర్‌జేడీ ప్రతాపరెడ్డిపై దాడి నీచమైన చర్య అని, ఇలాంటి దౌర్జన్యపూరిత చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని పీఆర్‌టీయూ నంద్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎర్రం రాంపక్కీర్‌రెడ్డి, శ్రీనివాసులు తెలిపారు. స్థానిక జిల్లా శాఖ కార్యాలయంలో శుక్రవారం నాయకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం, నాడు-నేడు పనుల పురోగతిపై అనంతపురం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించడం తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన అంశాలు ఉన్నాయని భావిస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలే తప్ప దాడులకు పాల్పడటం తగదన్నారు. దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, చంద్రమౌళి, హుసేన్‌సాహెబ్, శ్రీనివాసరెడ్డి, మునిరెడ్డి, శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, బషీర్‌బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాంపక్కీర్‌రెడ్డి

దాడులు మంచిది కాదు..

నంద్యాల(వ్యవసాయం): కడప ఆర్‌జేడీ ప్రతాపరెడ్డిపై అనంతపురంలో జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు 98 డీఎస్సీ క్వాలిఫైడ్స్ రాష్ట్ర నాయకులు సోమసుందరశాస్త్రి, బైరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఇటువంటి చర్యలు సరికాదన్నారు. ఆర్‌డీటీ అందుల పాఠశాలలో హెచ్‌ఎంలతో విద్యాపరమైన అంశాలపై సమీక్ష సమావేశం ముగించుకొని వస్తుండగా దాడి చేయడం దురదృష్టకరమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రకాష్, తిమ్మారెడ్డి, శర్మ, విశ్వనాథ్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పనిసరి



గడివేముల జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ

గడివేముల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని డిప్యూటీ డీఈఓ మహమ్మద్ బేగ్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రం జెడ్పీహైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం అమలును తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తుండటంతో నిర్వాహకులను అభినందించారు. అనంతరం డిప్యూటీ డీఈఓ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన కూరగాయలు ఉపయోగించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. తర్వాత ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దస్తగిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థిని ప్రతిభ

జూపాడుబంగ్లా: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ పదో తరగతి విద్యార్థిని చిన్నమ్మ వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ కనబరిచింది. పాఠశాల ఎస్‌ఓ యశోద, ఉపాధ్యాయులు శుక్రవారం విద్యార్థినిని అభినందించారు. వారు మాట్లాడుతూ కర్నూలులో జరిగిన శాప్ లీగ్, ఏపీ సీఎం కప్ పోటీల్లో విద్యార్థిని చిన్నమ్మ ప్రతిభ కనబరిచి మూడోస్థానంలో నిలిచిందన్నారు. అలాగే ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు జగ్గయ్య పేటలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో అండర్ 17 విభాగంలోనూ ప్రతిభ చూపిందన్నారు.

జూనియర్ సివిల్ జడ్జి బదిలీ

ఆత్మకూరు రూరల్: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి వి.రఘునాథ్‌ను పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్(విజిలెన్స్) శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆయన స్థానంలో ఇటీవల జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన తిరుపతికి చెందిన పీజే తేజసాయిని నియమించారు.

ఓపెన్ డే విజయవంతం

కోవెలకుంట్ల: స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఓపెన్ డే కార్యక్రమం విజయవంతమైంది. పట్టణంలోని వివిధ జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు కళాశాలను సందర్శించారు. జవహర్ నాలెడ్జ్, స్కిల్ సెంటర్లు, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీలను పరిశీలించారు. అలాగే వివిధ ప్రయోగశాలలకు వెళ్లి పరికరాలు, జంతునమూనాలు, హెర్బేరియం, సైన్స్ ఎగ్జిబిషన్, స్పెషిమన్లను పరిశీలించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

ఉయ్యాలవాడ : సచివాలయ ఉద్యోగులు విధి నిర్వహణలో సమయ పాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. శుక్రవారం మండలంలోని తుడుమలదిన్నె గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సచివాలయానికి ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీకి జవాబుదారిగా ఉండి అర్హులదరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత ఉద్యోగులపై నుందన్నారు. సచివాలయం వదిలి ఎక్కడికైనా బయటికి వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేసి వెళ్లాలని చెప్పారు. సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు అన్ని శాఖల ఉద్యోగులు సచివాలయంలో ఉండి సమస్యలకు సంబంధించిన పరిష్కారం తమ పరిధిలో లేనివి ఉంటే వెంటనే మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి చొరవ చూపాలని ఆయన ఆదేశించారు.

20న రాష్ట్రస్థాయి బండ లాగుడు పోటీలు

పాములపాడు: మండలంలోని ఇస్కాల గ్రామంలో శివరాత్రి సందర్భంగా ఈ నెల 20న రాష్ట్ర స్థాయి పాల బండ లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నందీశ్వర స్వామి రైతు సంఘం సభ్యులు శుక్రవారం తెలిపారు. పోటీల్లో పాల్గొన దలిచిన ఎడ్ల యజమానులు ప్రవేశ రుసుం రూ.500 చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలని తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.40,016, రెండవ బహుమతి రూ.25,016, మూడవ బహుమతి రూ.15,016, నాల్గవ బహుమతి రూ.10,016, ఐదవ బహుమతి రూ.5,016, ఆరవ బహుమతి రూ.3,016 చొప్పున ఇవ్వనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 9866513812, 9550561950, 6304850031, 9704057249లను సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత



విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

నంద్యాల(వ్యవసాయం): పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కాలర్‌షిప్‌లకు ఎంపికైన విద్యార్థులకు శుక్రవారం రైల్వే పోస్టల్ శాఖ కార్యాలయంలో స్కాలర్‌షిప్‌లు, మెమొంటోలను సూపరింటెండెంట్ శ్రీనివాసరావు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గతేడాది అక్టోబర్‌లో నంద్యాల డివిజన్ స్థాయిలో దీన్‌దయాళ్, స్పర్శ యోజన పథకం కింద హైస్కూల్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల కోసం పరీక్షలు నిర్వహించగా నంద్యాల జిల్లా వ్యాప్తంగా 130 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఎంపికలో పట్టణానికి చెందిన గుడ్‌షెప్పర్డ్, నూనెపల్లె మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన 9 మంది ఎంపికయ్యారని, వీరికి 2022-23 సంవత్సరానికి గాను ఒక్కొక్కరికి రూ.6వేలు స్కాలర్‌షిప్ అందించామని వివరించారు. శ్రీనివాసరెడ్డి, విజయేంద్ర, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా నంది విగ్రహ ప్రతిష్ఠోత్సవం



నూతనంగా ప్రతిష్ఠించిన నందివిగ్రహం

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని శ్రీ భవాని సమేత శ్రీ భృంగీశ్వరస్వామి ఆలయంలో నంది విగ్రహ ప్రతిష్ఠోత్సవం వైభవంగా జరిగింది. రెండో రోజు శుక్రవారం అర్చకులు విశిష్టపూజలు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరై పరమశివునికి జలాభిషేకం, కలశపూజ , మంగళహారతి నిర్వహించారు. అనంతరం నంది విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొని మాట్లాడారు. ఎంతో చరిత్ర కలిగిన భృంగీశ్వరస్వామి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ప్రస్తుతం శ్రీవీరనారాయణ స్వామి ఆలయానికి వచ్చే భక్తులు పక్కనే ఉన్న శ్రీ భృంగీశ్వరస్వామికి వచ్చి పూజలు చేసుకుంటున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాణ్యం గ్రామంలో జరిగిన పలు వివాహాలకు హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు కరుణాకర్‌రెడ్డి, పాణ్యం ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సుబ్బరాయుడు, పుల్లయ్య, బాబు, మాజీ ఆలయ చైర్మన్లు రాజనాల సుధాకర్, శంకర్‌గౌడ్, కో-ఆప్షన్ సభ్యులు జాకీర్ ఉసేన్, ఎల్లకిట్టు, వెంకటేశ్వర్లు, లక్ష్మీరెడ్డి, నారాయణ, టైలర్‌బాషా, పిన్నాపురం సర్పంచ్ ఎల్లక్రిష్ణయ్య, మహేంద్రారెడ్డి , వెంకట సుబ్బయ్య, గౌడ్, ఆటోమాబు, తదితరులు పాల్గొన్నారు.

మంచి ఆర్థిక ప్రవర్తనతో రక్షణ



కరపత్రాలను విడుదల చేస్తున్న రెహమాన్

నంద్యాల(అర్బన్): ప్రతి ఒక్కరూ మంచి ఆర్థిక ప్రవర్తన కలిగి ఉండాలని, అదే మీకు రక్షణ ఇస్తుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం.జెడ్ రెహమాన్ పేర్కొన్నారు. స్థానిక రామకృష్ణ పీజీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత వారోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ డిజిటల్ బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకొని నగదు రహిత లావాదేవీలు నిర్వహించాలని కోరారు. అవగాహన లేని ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్ ద్వారా ఆర్థిక మోసాలకు గురి కావద్దని సూచించారు. సీఎఫ్‌ఎల్ పీడీ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజలందరూ ఆర్థిక అక్షరాస్యత పెంచుకొని పొదుపు వైపు పయనించాలని చెప్పారు. అలాగే సుజల పైప్స్ కంపెనీలో ఎండీ సుజల ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ సత్యనారాయణ, కళాశాల డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, మదర్ సొసైటీ అధ్యక్షుడు రామారావు, సీఎఫ్‌ఎల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రుద్రవరం: మండలంలోని ఎల్లావత్తుల-కోటకొండ గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. నంద్యాలలోని రైతు నగరానికి చెందిన గుర్రప్ప, నరసమ్మ రజక వృత్తిలో భాగంగా మండలంలోని పెద్దకంబలూరుకు మోటార్ సైకిల్‌పై వచ్చి వెళ్లేవారు. దిన చర్యలో భాగంగా వారు శక్రవారం తిరిగి వెళ్లే సమయంలో రెండు గ్రామాల మధ్య మోటార్ సైకిల్ అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టుకు ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ గాయపడగా అటుగా వెళ్లే వారు క్షత గాత్రులను చికిత్స నిమిత్తం 108లో నంద్యాలకు తరలించారు.

డాక్యుమెంట్ పోయినది

డాక్యుమెంట్ నెంబర్ (973/2005) రిజిస్ట్రేషన్ ఇన్ పాణ్యం ఇంటి దగ్గరలో జిరాక్స్ షాప్ నందు నా ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినాయి. ఎవరికైనా దొరికినచో
Sane Naga Malliswari W/o Sane Sreenivasulu Nandyal. Cell : 98857 95216

మహారాజశ్రీ నంద్యాల రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.A. No. 29/2022 in
E.P. No. 67/2016 in O.S.No. 147/2012
గౌండి శ్రీనివాసులు ... Petitioner
-Versus-
1. నాగేశ్వరయ్య 2. పోతుల ఓబన్న (J.Dr)
3. ఎం.వెంకట నాగరాజా ప్రసాద్ (D.Hr)
.. Respondents
R2, పోతుల ఓబన్న తండ్రి ఓబులేసు, వయస్సు 40 సం॥, వ్యవసాయము, R/o రామాపురం గ్రామము, బండి ఆత్మకూరు మండలం, నంద్యాల జిల్లా

R2, ప్రతివాది నోటీస్

పై తెలిపిన దావా/అర్జీ (EP Proceedings)లో వాది/ అర్జీదారుడు, ప్రతివాదులు అయిన మీ పైన దావా/అర్జీ దాఖలు చేసినారు. R2, ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా, పోస్ట్ ద్వారా, నోటీస్‌లు ఎన్నిసార్లు పంపిన, మీరు తీసుకోనందున, పై దావా/అర్జీ (EP Proceedings)లోని అంశాలపై మీకు ఏమైనా అభ్యంతరాలు ఉన్న యెడల, పై కోర్టులో తేది 21-02-2023 ఉదయం గం. 10.30 నిమిషాలకు, పై కోర్టు ఎదుట హాజరై మీరు కాని మీ తరపున న్యాయవాది కాని ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేని యెడల మీ పరోక్షమందు దావా/అర్జీ (EP Proceedings) తీర్మానించబడునని తెలియజేయడం అయినది.
కోర్టులో వాయిదా తేది: 21-02-2023

శ్రీ రావినూతల దుర్గాప్రసాద్ గారు,
రావినూతల విశ్వనాథ్ గారు
న్యాయవాదులు, నంద్యాల-518501
సెల్: 85559 17274